*''చుక్కా..''!! ఆ గర్జన విని భయంతో వణికిపోయింది చుక్క.*

*''నువ్వింక మా ఇంట్లో పని మానేశేయి. రేపటినుండీ రానవసరం లేదు.*

*''నీకే చెప్పేది. కదలవేం''?*

*''ఎందుకండమ్మగారూ...'' పీల స్వరంతో అడిగింది చుక్క. దాని గుండెల్లో 'వణుకు' ప్రారంభమయింది.*

''ఎందుకని.. ఇంకా 'నంగనాచి'లా అడుగుతున్నావా? 'బేబీ'కి అన్నం తిన్పించే 'వెండిగిన్నె' ఎక్కడమ్ముకున్నావో మర్యాదగా చెప్పు? ఈ ఇంట్లోకి నువ్వు తప్ప, మరో మనిషి వచ్చే అవకాశమే లేదు'' చుక్క యజమానురాలు, మరియు ఆంధ్రుల ఆరాధ్య రచయిత్రి అయిన 'అంబికాదేవి' మాటలవి.

''అమ్మ..గా..రూ! దాదాపు ఏడుస్తున్నట్లుగా వుంది చుక్క స్వరం.

''నీ కల్లబొల్లి ఏడుపులు చూసి నేనేమీ కరిగిపోను. వెండిగిన్నె కనుక కనుక్కోగలిగాను. రోజూ ఇంకా ఏమేమి కాజేసుకెళ్తున్నావో ఎవరు చూశారు? నిన్ను క్రింద వదిలి, నేను పైన వ్రాసుకుంటూ వుంటాను. ఆయనేమో ఎప్పుడోకాని ఇంట్లో వుండరు. ఏదో పాపమని దయతలచి నా ఇంట్లో పనిచ్చినందుకు బాగా బుద్ధి చెప్పావ్. ఛీ..! కుక్కబుద్ధి ఎక్కడకు పోతుంది..''? ఛీత్కారం వేసింది అంబికాదేవి.

''అమ్మా..! అంత మాటనకండమ్మా..! నేను వెండిగిన్నె దొంగిలిత్తానా? నా పానం పోయినా అట్టాంటి పని సేయను తల్లీ..! ఇన్ని రోజులనుండీ నన్ను సూత్తున్నారు. నేనెలాంటి దాన్నో మీకు తెల్వదా..? నన్ను నమ్మండమ్మా..! నేనా గిన్నె తీయలేదు తల్లీ! ఇంట్లోనే యాడనో వుండి వుంటుది. సరిగ్గా సూడండమ్మా..''! ఏడుస్తూ అంది చుక్క.

''నోర్ముయ్ ..! నేనేమన్నా గుడ్డిదాన్నా? మర్యాదగా నా ఇంట్లోనుండి తక్షణం కదులు''..గర్జించింది అంబికాదేవి. చుక్క ఏడుస్తూ, ఆమె కాళ్ళను పట్టుకోబోయింది. కాని అంబికాదేవి 'ఛీత్కారం' వేస్తూ విదిలించింది.

''పాపం.. అది తీయలేదని అంటున్నదిగా అంబీ! ప్రక్కింటి వాళ్ళకెవరికైనా ఇచ్చావేమో సరిగ్గా గుర్తు తెచ్చుకో!'' అంబికాదేవి భర్త 'సుకుమార్' జాలిగా అన్నాడు.

''మీరు నోరు మూసుకోండి. అసలు మీరిచ్చిన 'అలుసుతో'నే అదంత పని చేసింది''.. ఒక్క గదుము గదిమింది భర్తను. భార్యాభర్తల అనుబంధం గురించి పుంఖాను పుంఖాలుగా వ్రాసే గొప్ప అభ్యుదయ రచయిత్రి అంబికాదేవి. అతని నోరు ఠక్కున మూతబడిపోయింది. అసలు 'తొలిరాత్రే' పాపం ఆ మానవుడి నోరు మూతబడిపోయిందని చెప్పాలి.

''ఇంకా అట్లాగే చూస్తూ నిలబడ్డావేం గుడ్లగూబలా?'' రెట్టించింది చుక్కను.

''అమ్మగారూ.. సిన్నదానికి జొరమొచ్చిందమ్మా! మూసిన కన్ను తెరవకుండా పడి వున్నాది. ఇయ్యాల మిమ్మల్నడిగి డబ్బులిప్పించుకెళ్ళి డాక్టరు దగ్గరకు తీసుకుపోదామనుకున్నానమ్మా! నన్ను కనికరించండి తల్లీ..! నేనే పాపం ఎరుగనమ్మా''!

''డబ్బులు లేవు.. గిబ్బుల్లేవు.. పో''!

''అట్టా.. అనకండమ్మా..! పోయిన నెల జీతమన్నా ఇయ్యండి తల్లీ..''! దీనంగా ప్రాధేయపడింది చుక్క.

''ముందు నువ్వా 'వెండిగిన్నె' తీసుకువస్తేనే ఏ నెల జీతమైనా ఇచ్చేది. పో.. వెళ్ళి తీసుకురా..! ఆ గిన్నెను మా చెల్లెలు ఎంతో ప్రేమగా ఇచ్చింది బేబీకి''.. చుక్క ఎంత ప్రాధేయపడినా ఫలితం లేకపోగా, ఆమె రంకెలకు చుట్టుప్రక్కల వారు కూడా గుమికూడి, విషయం తెల్సుకొని .. తమ ఇళ్ళల్లో కూడా 'పని వేయొద్దని' చుక్కను శాసించారు. చుక్క రోదన 'అరణ్యరోదనే' అయిందిక.

''పేదోళ్ళ గురించి అమ్మగారు ఎన్నో కతలు రాత్తారంట. ఆళ్ళ కట్టసుకాల గురించి ఎంతో బాగా రాత్తారని అందరూ సెప్పుకుంటారు. మరి.. నా మీద ఇంత నింద ఎట్టా ఏయగలిగారమ్మగారు..? తను ఏడ్సి మొత్తుకున్నా ఆయమ్మ మనస్సు కరగలేదేటి''? అలా అమాయకంగా ఆలోచిస్తూ ఇంటికి నడిచింది చుక్క.

● ● ● ● ●

అప్పటికి చుక్కను పని మాన్పించి నాలుగు రోజులైంది.

ఆ రోజు ఉదయాన్నే ప్రక్కింటి శ్యామల వాళ్ళ పిల్లాడ్ని కొడుతూ పెద్ద, పెద్దగా అరవసాగింది.

''ఎందుకండీ.. పసివాడ్నలా బాదు తున్నారు?'' మానవత్వం పుట్టిపడ్తున్న గొంతుతో అడిగింది అంబికాదేవి.

''వాల్లే ఊరుకోండి! కొట్టాలా... నరకాలా? మీ వాడు, మా వాడు కల్సి ఎంతెంత ఘనకార్యాలు చేస్తున్నారో మీకు తెలిసుండదు. మీ ఇంట్లో పోయిన ఆ వెండిగిన్నె, మా ఇంట్లో మావారి వాచీ, ఉంగరం... నేను బ్యాగ్‌లో దాచిన డబ్బు.. సూట్‌కేసులోని పట్టుచీర... అవ్వ...! ఒకటేమిటి..? ఇవన్నీ పట్టుకుపోయి వాళ్ళ స్కూలు దగ్గర ఎవరింట్లోనో అమ్మి.. సిగిరెట్లు, సినిమాలు.. ఇంకా ఏవేవో జల్సాలు చేస్తున్నారట. చాలా రోజుల నుండీ ఆ ఇనస్పెక్టరు గారు 'నిఘా' వేసి పట్టుకోవచ్చు. ఇవన్నీ బయట పడ్డాయి. లేకపోతే ఇంకెన్ని ఘనకార్యాలు చేసేవారో? ఆయన మా వారిని రోడ్డుమీద నిలేసి అడుగుతుంటే— వారి తల కొట్టేసినట్టయిందట. అసలు దీనికంతటికీ కారణం 'మీ వాడే'. మీరీ ఇంట్లో దిగకముందు, మా వాడు బుద్ధిగా వుంటూ శ్రద్ధగా చదివేవాడు. క్లాసులో కూడా ఎప్పుడూ ఫస్ట్‌న వుండేవాడు. మీ వాడితో స్నేహం ప్రారంభించాకనే ఇట్లా తయారయ్యాడు. మీరెప్పుడూ ఆ పిచ్చి రాతలేవో రాసుకోవడం తప్ప, ఆ పిల్లాడ్ని పట్టించుకుంటారా.. పెడ్తారా? మీ మాటలు నమ్మి బంగారంలాంటి పని మనిషి— పాపం ఆ చుక్కను కూడా పని మాన్పించి ... నానా ఇబ్బంది పడ్తున్నాం...'' అంబికాదేవికి నోరు విప్పే అవకాశమే ఇవ్వకుండా... ఎడాపెడా వాయించి, ఒక్క విసురువ తలుపులు



వేసుకుంది.

ఇంతలో.. పోలీసు ఇనస్పెక్టరు అక్కడకు వచ్చాడు. అతనితో అంబికాదేవి పదేళ్ళ కొడుకు రఘు కూడా వున్నాడు.

"చూడండి అంబికాదేవిగారూ! మీరు చూస్తేనేమో పెద్ద రైటరు. పిల్లల పెంపకం గురించి, తల్లిదండ్రులు తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి, ఎన్నెన్నో కథలు, వ్యాసాలు వ్రాసి... చాలా 'ప్రైజులు' కొట్టేశారు. కాని... మీ సుపుత్రుడ్ని ఇలా పెంచారేమిటండీ... ? ఇది చాలా విచారించవల్సిన విషయం.."

అంబికాదేవి ఏదో చెప్పబోయింది. కాని.. ఆమెకా అవకాశమే ఇవ్వకుండా.. "ముందు మనం 'ఆదర్శంగా' వుండి ఆ తర్వాతనే లోకోద్ధారణకు 'కంకణం' కట్టుకోవాలి. లేకపోతే ఇదిగో... ఇలాగే మీ వాడిలాగే తయ్యారవుతుంటారు.

"చూడండి...! పోయిన మీ వెండిగిన్నె... ఆ ప్రక్క వాళ్ళ వస్తువులు.. ఇంకా కొన్ని మా స్టేషనులో వున్నాయి. వచ్చి వాటిని తీసుకెళ్ళండి. బై!" సీరియస్‌గా హెచ్చరించి, తీవిగా వెళ్ళిపోయాడు ఇనస్పెక్టరు దివాకర్

ఈ దివాకర్ ఎవరో కాదు...? ఒకప్పుడు

# వెండి గిన్నె

## మాళ్ల వింధ్యారాణి

అంబికాదేవిని గాఢంగా ప్రేమించి, కేవలం ఒక్క ఆస్తి లేదన్న నెపంతోనే. ఆమెచే తిరస్కరింపబడ్డ భగ్నప్రేమికుడు.

పిచ్చి చూపులు చూస్తూ, అలాగే గుమ్మంలో కూలబడిపోయింది ప్రఖ్యాత రచయిత్రి అంబికాదేవి.